నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 హైదరాబాద్, బుధవారం 27 మార్చి 2024 VIKARABAD


## బోర్ వెల్స్, హ్యాండ్ పంప్‌లు వర్కింగ్ కండీషన్‌లో ఉండాలి

**అధికారులను ఆదేశించిన వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**



వికారాబాద్, మార్చి 26 : ప్రతి మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ పరిధిలో బోర్ వెల్స్, హ్యాండ్ పంప్‌లు వర్కింగ్ కండీషన్‌లో ఉండేలా చూడాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మిషన్ భగీరథ అధికారులు, ఏఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు గైడ్ చేయాలని, మంజూరైన పనులను పూర్తి చేయాలన్నారు. తాగునీటికి సంబంధించిన పనులన్నింటినీ ఏప్రిల్ 5వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. బోర్‌లు, చేతి పంపులు రిపేరు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీపీవో జయసుధ, మిషన్ భగీరథ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఖర్చు చేయకుంటే వెనక్కే..

**రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలలు, స్కూల్ కాంప్లెక్స్‌లు, ఎమ్మార్సీలకు ఆలస్యంగా నిధుల మంజూరు**

**స్కూళ్లలోని వివిధ విభాగాలకు రూ.48.17కోట్లు కేటాయింపు**

**ఈనెల 31లోపు ఆ నిధులను ఖర్చు చేయాలని ఆదేశాలు**

**ఇక మిగిలింది ఐదు రోజులే..అందులో రెండు సెలవు దినాలే !**

**అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ వర్గాలు**

రంగారెడ్డి, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : పాఠశాలలు, ఎమ్మార్సీలు, స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు రెండో విడుతలో మంజూరు చేయాల్సిన నిధులను ప్రభుత్వం ఇటీవలే ఆలస్యంగా విడుదల చేసింది. ఈ మేరకు వివిధ విభాగాలకు రూ.48.17 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే ఈ నిధులను మార్చి 31 లోపు ఖర్చు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఐదు రోజులే మిగిలి ఉండడం..మధ్యలో 29, 31 తేదీల్లో బ్యాంకులకు సెలవులు ఉండడంతో ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. నిధులు ఇచ్చినట్లే ఇచ్చి..వెనక్కి తీసుకునే ప్రయత్నంపై ఆయా వర్గాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

**గడువుతో తర్జనభర్జన..**

ప్రతి ఏటా విద్యాశాఖ పాఠశాలలకు రెండు విడుతల్లో నిధులను మంజూరు చేస్తుంది. గత జూలై-ఆగస్టు మాసంలో 50 శాతం నిధులు రాగా.. తాజాగా మిగతా సగం నిధులను విడుదల చేసింది. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు-881, ఉన్నత పాఠశాలలు-181, హైస్కూల్స్-247, కస్తూర్బాలు-20, మాడల్ స్కూల్స్-9 వరకు ఉన్నాయి. వీటి నిర్వహణకు విద్యాశాఖ రెండోవిడుత నిధుల ను మంజూరు చేసింది. ఈ నిధుల్లో చాలావరకు ఇప్పటికే ఖాతాల్లో జమకాగా.. మరి కొన్ని ఖాతాల్లో నేటికీ జమ అవుతూనే ఉన్నాయి. మొదటి విడుతలో మంజూరైన నిధులను చాలా పాఠశాలలు వివిధ కారణాలతో ఖర్చు చేయలేదని తెలిసింది. ఈ క్రమంలోనే మార్చి 31లోపు రెండో విడుతకు సంబంధించినవి ఖర్చు చేయకుంటే వెనక్కి తీసుకుంటామని విద్యాశాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ కొద్దిరోజుల్లోనే ఈ నిధులను దేనికి ఖర్చు చేయాలో తెలియక ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ఇబ్బంది పడుతున్నారు. కొందరు బకాయిల బిల్లులను చెల్లిస్తుంటే..మరికొంత మంది వార్షిక పరీక్షలకు సంబంధించిన సామగ్రిని ఇప్పుడే కొనుగోలు చేస్తున్నారు.

**భారంగా మారిన పాఠశాలల నిర్వహణ..**

ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో వివిధ విభాగాలు వివిధ రకాలుగా వెచ్చిస్తున్నాయి. క్యూ కాంప్లెక్సుల్లో సమావేశాల నిర్వహణ, స్టేషనరీ తదితర వాటికి ఖర్చు చేస్తున్నారు. పాఠశాలల నిర్వహణకు సంబంధించి కరెంటుతోపాటు బ్లాక్ బోర్డు, చాక్ పీస్‌లు, స్టేషనరీ తదితర వాటికి ఖర్చు చేస్తున్నారు. ఎమ్మార్సీ కేంద్రాల్లో కరెంటుతోపాటు టెలిఫోన్ బిల్లులు, ఇంటర్నెట్, టీ, స్టేషనరీ ఇతర ఖర్చుల కోసం వెచ్చిస్తున్నారు. కొన్నింటిని స్పోర్ట్స్‌కు సంబంధించి ఆట వస్తువులు, సబ్బులు, ఫినాయిల్, స్టేషనరీ తదితర వాటిని కొంటున్నారు. అయితే ఈ ఏడాదిలో నిధులను ఖర్చు చేసేందుకు పలు అడ్డంకులు ఏర్పడడంతో పాఠశాలల నిర్వహణ భారంగా మారింది.

గతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎంసీ కమిటీల ఆమోదంతో నిధులను విడుదల చేసుకునేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎంసీ కమిటీలను రద్దు చేసింది. వాటి స్థానంలో ఆదర్శ మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ..ఎన్నికల కోడ్‌తో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సీనియర్ ఉపాధ్యాయుడితో బ్యాంకు ఖాతాలు తీయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఈ మధ్యనే బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. రెండో విడుత నిధులను ఆలస్యంగా ఖాతాల్లో జమ చేయడం..గడువులోగా ఖర్చు చేయకుంటే నిధులు వెనక్కి తీసుకుంటామని చెబుతుండడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొన్నది.

వచ్చిన నిధులు వెనక్కిపోతే పాఠశాలల నిర్వహణ, స్టేషనరీ, ఇతర సామగ్రికి డబ్బులు ఎలా సర్దుబాటు చేయాలని పాఠశాలల హెచ్ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే నిధులను విడుదల చేసినట్లైతే ఓ ప్రణాళిక ప్రకారం వెచ్చించడం వల్ల ప్రయోజనం ఉండేదని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# చేవెళ్ల గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా

**కాసాని జ్ఞానేశ్వర్ విజయం ఖాయం**

**కాంగ్రెస్ అంటేనే... కరువు, ఆకలికేకలు, తాగునీటి ఎద్దడి..ఆ పార్టీ అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే తెలంగాణలో కరెంటు పోయింది.. కరువొచ్చింది. ప్రజా సంక్షేమం అటకెక్కింది. ఈ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారని నార్సింగిలో మంగళ వారం జరిగిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో నేతలు పేర్కొన్నారు.**

- కాంగ్రెస్ వచ్చింది..కరువును తెచ్చింది
- తప్పుడు హామీలతో గద్దెనెక్కి.. ప్రజలను నట్టేట ముంచుతున్నది
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- నార్సింగిలో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, వాణీదేవి, దయానంద్
- ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, యాదయ్య

మణికొండ, మార్చి 26 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో కరువును తీసుకొచ్చిందని.. తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం, నార్సింగిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్‌కిట్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇచ్చి పేదలకు మేలు చేస్తే.. అంతకంటే బాగా చేస్తారేమోనని కాంగ్రెస్‌ను నమ్మి ఎన్నికల్లో గెలిపిస్తే మమ్మల్ని నట్టేట ముంచారని ప్రజలు బాధపడుతున్నారన్నారు. చేవెళ్ల అభ్యర్థులుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ప్రస్తుతం బరిలో ఉన్న ఇద్దరికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే గుర్తింపు వచ్చిందన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి గెలిపించారని గుర్తు చేశారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత రంజిత్‌రెడ్డి ఎందుకు పార్టీ మారారో తెలియదని...కానీ బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తల శక్తిని తక్కువగా అంచనా వేసి పార్టీ వీడిన వారికి మన శక్తి చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేద్దామన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికలను బీఆర్ఎస్ శ్రేణులు ఓ చాలెంజ్‌గా తీసుకుని కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయన రంగారెడ్డి జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్సీగా బడుగు, బలహీల వర్గాలకు అండగా ఉన్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలందరూ లబ్ధి పొందారన్నారు. అంతేకాకుండా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల అభ్యున్నతికి కేసీఆర్, కేటీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను టార్గెట్ చేసి తిట్టడమే పనిగా పెట్టుకుని.. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు. కోడి గుడ్డుపై ఈకలు పీకినట్లుగా పాలన సాగుతున్నదన్నారు. తెలంగాణలో కేసీఆర్ పేరు, గుర్తు లేకుండా చేస్తానంటూ సీఎం రేవంత్ అతిగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం, తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పేరు పలుకుతూనే ఉంటారన్నారు. కార్యక్రమంలో నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు, రేఖా యాదగిరి, సుష్మారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు వేణుగోపాల్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, పార్టీ అధ్యక్షులు నర్సింహ, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు ప్రవీణ్‌కుమార్, శివారెడ్డి, శ్రీకాంత్, ఉషారాణి, రామకృష్ణారెడ్డి, అరుణజ్యోతి, శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట మండలాల నాయకులు, కార్యకర్తలు అధిక ఎత్తున పాల్గొన్నారు.

**అభివృద్ధి ప్రదాత కేసీఆర్ ..**



రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను 80శాతం వరకు పూర్తి చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసింది. కాంగ్రెస్ వచ్చింది కరెంట్ పోయింది.. కరువు వచ్చింది. రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నది. రానున్న ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగువేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే చేవెళ్ల

**సంస్కారం లేని నాయకుడు 'రంజిత్‌రెడ్డి'**



కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఒక ప్రణాళిక ప్రకారం పాలన సాగింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇష్టం వచ్చినట్లు నడుస్తున్నది. గత పదేండ్ల కాలంలో ఎప్పుడూ కరెంటు పోలేదు.. నీళ్లు, సంక్షేమ పథకాలు ఆగలేదు. రంజిత్‌రెడ్డి అనే వ్యక్తి మన ప్రాంతానికి చెందిన వ్యక్తి కాకున్నా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మనమందరం కష్టపడి ఎంపీగా గెలిపించుకున్నాం..కానీ ఆయనకు సంస్కారం లేదు. అలాంటి వారిని రానున్న ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలి. బీసీ బిడ్డ, మనలో ఒకరిగా ఉండే కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం.

–ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్యే, రాజేంద్రనగర్

**కాసానిని గెలిపించుకుందాం..**



అధికారం కోసం.. స్వలాభం కోసం పార్టీలు మారిన నాయకులకు రానున్న ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలి. బీసీ బిడ్డ, మనలో ఒకరిగా ఉండే కాసాని జ్ఞానేశ్వర్‌కు మనమంతా అండగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఆయన జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఈ ప్రాంత అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. వ్యక్తిగతంగా అనేక మందిని ఆదుకున్నారు.

– బుగ్గారాపు దయానంద్, ఎమ్మెల్సీ

**ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా..**



చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తనను బరిలోకి దింపినందుకు కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఆశీర్వదించి గెలిపిస్తే.. మీలో ఒక్కడిగా ఎప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. సాధ్యం కాని హామీ లిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలి. వంద రోజు ల్లో ఆ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. రాష్ట్రంలో ప్రణాళిక లేని పాలన సాగుతున్నది.

–కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి

**ఒక్క హామీనీ నెరవేర్చలె..**




చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ పేరును పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసినప్పుడే విజయం ఖాయమైంది. కేసీఆర్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వంద రోజులు గడిచినా రేవంత్ సర్కారు ఒక్క హామీనీ నెరవేర్చలేదు. వ్యవసాయాన్ని గాలి కొదిలేసింది. విద్యుత్తు కోతలతో అన్నదాతలు అల్లాడుతున్నారు.

–వాణీదేవి, ఎమ్మెల్సీ

**96 కులాలను ఏకం చేసిన కాసాని..**



కాంగ్రెస్ సర్కారు అధికారం చేపట్టి వంద రోజులు గడిచినా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు. షాదీముబారక్, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఏమైంది. రైతు బంధు డబ్బులు బ్యాంకుల్లో జమ కాకపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. సాగునీరు లేక రైతన్నలు అల్లాడుతున్నారు. విద్యుత్తు కోతలతో అవస్థలు చెప్పలేనివి. కేసీఆర్ హయాంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నారు. 96 కులాలను ఏకం చేసి బీసీ సామాజిక వర్గాలకు ఏకతాటిపైకి తెచ్చిన కాసాని జ్ఞానేశ్వర్ ను రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుందాం.

–యెగ్గె మల్లేశం, ఎమ్మెల్సీ



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

# వచ్చీరాని వైద్యం.. గాలిలో ప్రాణం!

- అమాయక ప్రజల ప్రాణాలతో ఆర్ఎంపీల చెలగాటం
- అర్హతలేకున్నా ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో అన్ని రోగాలకు చికిత్స
- మిడిమిడి జ్ఞానంతో వైద్యం.. ప్రజల ప్రాణాలకు ముప్పు
- అదనపు ఆదాయం కోసం మెడికల్ షాపులూ నిర్వహణ

పరిగి, మార్చి 26 : మిడిమిడి జ్ఞానంతో వచ్చిరాని వైద్యం చేస్తూ ఆర్ఎంపీలు పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పేరుకు ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల బోర్డులు పెడుతూ అన్ని రోగాలకు చికిత్స అందిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. పరిగిలో కొంతకాలంగా ఆర్ఎంపీల ఆగడాలు మితిమీరుతున్నాయి. వారి వైద్యానికి పలువురు బలవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. జిల్లా స్థాయిలో ఉండే ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, అవినీతి వల్లనే ఆర్ఎంపీల ఆకృత్యాలకు అడ్డుకట్ట పడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సీజ్..**

దోమ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన బంటు శ్రీనివాస్ మృతికి పరిగికి చెందిన ఆర్ఎంపీ గఫార్ కారణమని, చర్యలు తీసుకోవాలని పలువురు జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 22వ తేదీన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు డాక్టర్లు జీవరాజ్, రవీంద్ర, డిప్యూటీ డెమో శ్రీనివాస్‌లు విచారణ చేపట్టారు. యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్న ఎండీ గఫార్‌కు క్లినిక్ నిర్వహణ, అల్లోపతి వైద్యం చేయడానికి ఎలాంటి అర్హతలు, అనుమతులు లేవని నిర్ధారించి ఆ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు విచారణ నివేదికను డైరెక్టర్ ఆఫ్ హెల్త్, జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని అధికారులు తెలిపారు. ఇక్కడివరకు అంతాబాగానే ఉన్నా గఫార్ లాంటి వారు మరేందరో యథేచ్ఛగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో వైద్యం చేస్తుండడం గమనార్హం.

**అల్లోపతి వైద్యం చేసేందుకు అనర్హులు...**

ఆర్ఎంపీలకు అల్లోపతి వైద్యం చేసే అర్హత ఉండదు. వారు కేవలం ప్రాథమిక చికిత్సను అందించాల్సి ఉంటుంది. కానీ గతంలో ఆర్ఎంపీలు ఏకంగా డాక్టర్లమంటూ బోర్డులు వేలాడదీసుకొని ప్రజలకు చికిత్స అందించేవారు. దీన్ని గమనించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ జోక్యంతో వాటి స్థానంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. కానీ నేడు తెలిసితెలియని జ్ఞానంతో అన్ని రోగాలకూ వైద్యమందిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు.

**అవసరం లేకున్నా హైడోస్‌లిస్తూ..**

ప్రైవేటు క్లినిక్‌ల్లో ఎంబీబీఎస్ డాక్టర్లు వైద్యం కోసం రూ.150 వరకు తీసుకుంటుండగా.. ఆర్ఎంపీలు రూ.100 వసూలు చేస్తూ ప్రజలను తమవైపు తిప్పుకొంటున్నారు. అవసరం లేకున్నా మందులు రాస్తూ, ఇంజెక్షన్లు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్ఎంపీలు అసలు ఇంజెక్షన్ సైతం ఇవ్వకూడదని అధికారులు పేర్కొంటుంటే.. పరిగిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉన్నది.

కొందరు ఆర్ఎంపీలు చిన్నపాటి రోగానికే సెలైన్లు సైతం ఎక్కిస్తూ అమాయక ప్రజల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. మందులు హై డోస్ ఇచ్చి త్వరగా జబ్బు నయమయ్యేలా చూడడం వల్ల ప్రజల సైతం ఎంబీబీఎస్ డాక్టర్ల కంటే ఆర్ఎంపీల వద్దకే అధికంగా వెళ్తున్నారు. వాస్తవానికి వైద్య శాస్త్రం ప్రకారం తక్కువ డోసు మొదలుకొని వ్యాధి తగ్గని పరిస్థితిలో అధిక డోసు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆర్ఎంపీలు ఇదేమీ పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా అధిక డోసులిస్తున్నారు. దీంతో మరోసారి వైద్యం అవసరమైతే అంతకంటే ఎక్కువ డోసు ఇస్తే తప్ప ప్రజలకు రోగం నయం కాని దుస్థితి ఏర్పడుతున్నది. అధిక డోసు ఇవ్వడం హానికరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా ఆర్ఎంపీలు పెడచెవిన పెడుతున్నారు.

**బంధువుల పేరిట మెడికల్ షాపులు...**

పరిగిలోని పలువురు ఆర్ఎంపీలు వైద్యం చేయడం ద్వారా వచ్చే ఆదాయం సరిపోదన్నట్లు కొందరు తమ బంధువుల పేరిట మెడికల్ షాపులు ఏర్పాటు చేసి ప్రతి చిన్న రోగానికీ అధిక మొత్తంలో మందులు రాసి రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఆర్ఎంపీలు అసలు ప్రిస్క్రిప్షన్లు రాయొద్దనే నిబంధనలు ఉండడంతో.. వారు రాసే ప్రిస్క్రిప్షన్ బయటకు పోనివ్వకుండా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పక్కనే తమవారు ఏర్పాటు చేసిన మెడికల్ షాపులోనే మందులు కొనుగోలు చేయాలని రోగులకు సూచిస్తున్నారు. ఎవరైనా ఇతర మెడికల్ షాపులకు వెళ్తే ఈ మందులు కావంటూ వాటిని తిప్పి పంపిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించి ఆర్ఎంపీల ఆగడాలకు అడ్డుకట్ట పడేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.




యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు (ఫైల్)